# ఆడలేక మద్దెలమీదపడి కొట్టుకోవడమా?

శ్రీమతి కందాళం కమలమ్మగారు

'ఏమండీ ?'

'.........'

'ఏంపలకరూ?'

'.........'

'కొంచం టీ తీసుకోండి.'

'.........'

'ఇదో చూడండి చల్లారిపోతూంది.'

'... .....'

'దేనిలోనో లయింప చేసేరే మనసును.'

'ఊఁహ్! అవతలపో.'

'ఈవాళ ఓలాగున్నారే, యెందుకూ?'

'.........'

'ఏమిటా పుస్తకాలు ?'

'వాటితో నీకేంపని?'

'ఏం? నేను చూడకూడదా?'

'మీరెంత కఠినహృదయులు! రాక్షసుల్లు !!'

'ఎవరండీ? ఆడవాళ్లే?'

'ఆ! నమ్మరాదు. పైకెంతో ప్రేమ చూపుతారు; గాని తేనెపూసిన కత్తులు.'

'ఆలాగా? కారణమేమో!'

'మరేముంది వారి సహజమయిన కుటిల స్వభావమే.'

'నేడేమో అంతా క్రొత్తధోరణిగావుంది. ఆ గ్రంధాలేమిటి, వేదాంతగ్రంధాలు గాబోలు! చూడనివ్వండి.'

'ఆ! ఆ!! ఆగు!! ఆగు!!! దగ్గరకురాకు. ఎంతసాహసం!!!!'

'ఇంత చీకాకేమిటి ఆ సాహసాలేమిటి కాస్త చెబుదురూ ?'

'చెబితే ఒప్పుకుంటావా ?'

'నిజమైన విషయమయితే-'

'అయితే నేచెప్పేదాంట్లో అబద్ధంకూడ ఉందన్నమాట.'

'ఏమో నాకెట్లుతెలుసు.'

'బడేబడే కవులు వ్రాసిన ప్రబంధాల్లో కూడానా?'

'చిల్లరగావుండవులేండి.'

'అంతా ఆక్షేపించడమే!'

'అంతాకాకుంటే కొంతైనా లేకపోతే ఆకవులు అంతపలుకుబడికెట్లా వస్తారు?'

'ఇదా నీ పోహణ.'

'ఈ మాటలకేం అసలు విషయం చెబుదురూ.'

'వినుమరి 'పురుషాణామభావేన' అని అన్నాడే...'

'ఆ శ్లోకం చెప్పిందెవరని?'

'ద్రౌపది.'

'అదేపొరబాటు వ్యాసుడుకదా వ్రాసినది.'

'కాదు ద్రౌపది చెప్పిందే.'

'ఆడదన్నదంటే మరేమాక్షేపణుంది.'

'ఆలాగని వీటిలో వ్రాసివుంది.'

'వ్రాసినంత మాత్రాన అందరికీ అంట గట్టడమా?'

'నీవు ఒప్పుకుంటావా, యింకా పెడవాద మేనా!'

'నేనేమిటి ఎవరూ ఒప్పుకోరు.'

'ఒప్పుకోకతీరదు. భారతం ఒప్పుకోవూ? బలవంతానైనా ఒప్పిస్తా.'

'చేతయితే...'

'ఒప్పుకుంటావా ? లేదా ?'

'దానికి సమాధానం చెప్పమంటారా ?'

'ఏదీ'

'ప్రతికవీ స్వానుభవంవల్లనే పుస్తకాలు వ్రాసి తమ తల్లులకూ చెల్లెళ్లకూ కూతుళ్లకూ ఈలాంటివే నేర్పుతాడు గాబోలు! అలాంటి 'నీచమైన అనుభవాలవల్ల నీచమనస్సును పొందినవారు అట్లా వ్రాయడం సహజమే.'

'ఒక్కటీ తలకెక్కడం లేదుసుమా !'

'పూర్వకవులు స్త్రీలను అంత నీచంగా చూడడం కులటలని భావించడము, వారికి పెద్దబానకడుపనీ, పురుషులకంటే ద్విగుణంగా మెక్కుతారని, దయ్యాలపోలికను వర్ణించడం లేనిపోని సాహసాలు కల్పించి వారిని అధఃపతితులని అనిపించడం, శ్లోకాలు పద్యాలు వ్రాసి గేలిచేయడం మామూలే. లేకుంటే ఏ వుత్తమకాంత పురుషుణ్ణి పాడుచేసింది? చెప్పండి? వారి నవనీతహృదయము పవిత్రత అవ్యాజమైనవారి మాతృప్రేమ దృఢనిశ్చయమూ అప్రమేయమైన ప్రతిభ కష్టకాలమందైనా తమనునమ్మిన పురుషులను విడువకుండా ప్రేమించే త్యాగమూ వారి కేమి తెలుసు. పురుషులంతా స్వార్థపరులు. వారికి అక్కరకొద్దీ కక్కుర్తి!'

'ఇంక నీ వుపన్యాసం చాలించు. ఇదా నీ సమాధానం ?'

'చంద్రుణ్ణి చంద్రికలాగు అరణ్యానికి రాముణ్ణి వెంటాడిన సీత, దొంగతనంగా తన్ను కష్టసాగరంలో వదలిపోయినా, భర్తను ప్రేమించడం మరువని దమయంతి, దొంగవలె తన్ను ప్రేమించి తన్ను నగరవాసుల మాటల్తో 'ఢంగు' చేసి లోబరచుకొని తానే స్వతంత్రింగాపోతే తెలియనట్లు అభినయించిన దుష్యంతునే నమ్మిన శకుంతలా మొదలయిన వారు ఎంతోమంది వున్నారా? ఇంక మగవాళ్ల...?'

'సారాంశమేమి తేల్చావుమరి?'

'ఆమాట ద్రౌపది చెప్పిందనిఅనుకుందాం. మరి ఆమె సుశీలకాదంటారా ?'

'పరమ పతివ్రత.'

'పతివ్రత యెట్లా అవుతుంది. రేణుక నీటిలో కార్తవీర్యార్జుని ప్రతిబింబం చూడంగానే శీలం భగంఅయిందని,కళంకంవచ్చిందని చాటాడుగదా వ్యాసుడు. ద్రౌపది త్రికరణశుద్ధిగా చెప్పినపుడు ఆమె సుశీల యెట్లవుతుంది ? మీ నీతిశాస్త్రం

స్మరణం కీర్తనం కేళిః శ్రవణం గుహ్యాభాషణం,
సంకల్పోఽధ్యవసాయశ్చ క్రియానివృత్తిరేవచ.

అని ఘోషిస్తుందే.'

'అల్లాంటీ పతివ్రత యేమున్నా దోషం లేదు.'

'మా బాగుంది మీమాట. పాపం! దోవలోపొయ్యే ఆమెకు పాపం రావడమూ బందుబూతులువాగే అమెకు పాపం లేక పోవడమునా! ఆ భారతంలోచెప్పిన, అరుంధతి, అనసూయ, సుదర్శనుని భార్య మొదలయినవారు తమశీలాన్ని ఏవిధంగా కాపాడుకున్నారు? పాతమాటలెందుకూ యిప్పుడు కూడా యెందరువెన్నికష్టాల్లో తమ మానం నిలబెట్టుకోడంలేదు. ద్రౌపది కెట్టి వాంఛ లేకున్నా కవులందరూ 'తమ హృదయానుమానం'తో స్త్రీలనంతా చూస్తూ లేనిపోని కల్పనలుచేసి వారె కంటగడతారు. 'పంచమే పతయస్సంతి మహ్యాం షష్ఠోపిరోచతే' అని ద్రౌపదిచే పలికించిన కవి ఎంత అనుమానాలబస్తానో ప్రపంచానికి తెలీదూ? దీన్ని వెనకవేస్కాని ఒక మహాకవి,

> 'భర్తాయద్యపి కామశాస్త్రనిపుణః విద్వాన్
> కులీనోయువా,
> దాతాకర్ణసమః ప్రసిద్ధవిభవః శృంగారదీక్షాగురుః।
> స్వప్రాణాధికకల్పితా ప్రియతమా స్నేహేన
> సంవర్ధితా
> తంకాంతం పశువద్విభాయతరుణీ జారంపతిం
> వాంఛతి ॥

అని ధైర్యంగా అనేశాడు. ఆ మనువుకు తల్లీ చెల్లెండ్లు వున్నారో లేదో, (వుంటే కూడా దుర్మార్గులుగా వుంటారు లెండి) 'సుందరం పురుషం దృష్ట్వా భ్రాతరం పితరం సుతం.....' అని ఏమేమో సెలవిచ్చారు. రామ! రామ!! ఇంతేనా, యీలాంటి వింకా యెన్నో వ్రాశినారు సిగ్గూ బిడియమూ లేకుండా.'

'కొంచం గుక్క తిప్పుకోనియ్యి.'

'ఇంకొక టేమంటే స్త్రీల ప్రస్తావన వచ్చినపుడు వాళ్లను అధోలోకానికి తొక్కెయ్యడము తమ మాటవస్తే శ్లాఘనగా చెప్పుకోడమూను.''

'ఎవరు! ఎవరు!!'

'ఎవరో ఎందుకు మీ 'ఆంధ్ర కవితా పితామహ' అల్లసాని పెద్దనగారే. వారికెంత స్వాభిమానమో చూడండి. మనుచరిత్రలో ప్రవరుణ్ణి ఎట్లా వర్ణించారో. వాని విషయపరాఙ్ముఖత యింద్రియనిగ్రహము బ్రహ్మతేజస్సూ—పైన పాదరసమూ! ఇక వరూధినిని—అమరకాంత కుండవలసిన—తుదకు సామాన్యస్త్రీకి వుండవలసిన—గుణాలన్నీ లేకుండా, క్రొత్తమనిషి ఒకడు రాగానే నిర్లజ్జగా నిర్భయంగా నిరాఘాటంగా—ప్రవర్తించేటట్టు చూపి స్త్రీ లోకానికంతా కళంకం కల్పించినాడు. అల్లాంటి చెత్తబుక్కులంతా మీరు కళ్లకద్దుకొంటారు.'

'ఇదిగో .....నీ కింత ప్రజ్ఞవుందని ఈ క్షణంవరకూ యెరగను సుమా?'

'నా ప్రజ్ఞేంగాని, మరోమగవాని ప్రజ్ఞ చూచారా. పాపం! పెద్దనకున్నంత యింద్రియనిగ్రహం భర్తృహరి మహాశయునికి లేదు.'

మ॥ నరకద్వారము, సాహసాకరము, పు
ణ్యస్వర్గ విఘ్నంబు, దు
స్తరమాయాశతపేటి, దంభనిధి, దో
షాధీన, మప్రత్యయో
త్కరసుక్షేత్రము, కాలకూట, మమృతా
కారంబు స్త్రీయంత్రముఁ
ధరనెవ్వాడుసృజించె పూరుషగళో
ద్బంధ క్రియాపాశముఁ.

అని చెడ ఏడ్చాడు. 'కర్మం కాలుపట్టి యీడిస్తే, మొగుడు మోకాలు పట్టి యీడ్చాట్ట' అన్నట్లు స్వర్గద్వారంనుంచీ వాళ్లను కాలుపట్టి యీడుస్తారు గాబోలు స్త్రీలు. 'ఆడలేక మద్దెలమీదపడి కొట్టుకుందిట' పూర్వం ఒకతె. తమ మనస్సును గట్టిపరచుకోలేక పైవారిమీదపడి అఘోరించడం మీదుమిక్కిలి తమ చంచలతకు సిగ్గైనా పడడంలేదు. ఎవరన్నా అడిగితే 'విశ్వామిత్రాపరాశరాదులే అట్లయినప్పుడు మన మేం లెక్కా జమా' అంటారు. 'బలవా నింద్రియగ్రామో విద్వాంస మపి కర్షతి' అని వ్యాసుడు తెలియక చెప్పినాడా అని సమాధానం చెబుతారు. స్త్రీల విషయమైతే వంద ధర్మశాస్త్రాలు వ్రాస్తారు. ఏదో పాపం! 'అహల్య పొరపాటుతో యింద్రుణ్ణి వలచిందని గౌతముడు పూరికేవున్నాడా?'

'ముసలాడుగా మరి!'

మరో తమాషా విన్నారా! సీతమ్మ సొమ్ములు చిక్కినప్పుడు వాటిని ఆనవాలు పట్టేందుకు లక్ష్మణుని ముందు పెట్టాడట రాముడు. వాటిని చూచి 'నాకు మరేవీ తెలీవు. అందెలు మాత్రం ఆమెవని తెలుసు' అన్నాట్ట లక్ష్మణుడు. అంటే ఏమన్న మాట? ఎప్పుడూ ఆమె ముఖమే చూడలేదని. తెల్లవారగానే చూడవలసిన తల్లిలాంటి సీత ముఖం చూడలేదంటే ఏం కారణం? చూస్తే ఎక్కడ మనస్సు చలిస్తుందో అనే సందేహమే సుమండీ!! మగవాళ్లంతా 'అబ్బితే జుట్టు అబ్బకపోతే కాళ్లు' అనే రకం.'

'అల్పవిద్యవారు ఆక్షేపణకోరుట.'

'నిజమాడితే నిష్ఠూరమే లెండి.'

'అయితే పాతపుస్తకాలన్నీ తప్పంటావా.'

'అబ్బే!'

'మరి నీ భావం.'

'ఎవరిభావాలు వారికేవుంటాయి. స్త్రీలు పురుషుల్లాంటివారే. వారికీ హృదయమూ బుద్ధీ మానమూ లజ్జావున్నాయి. అన్నిటికీ మనస్సే కారణం కనుక మనోనిగ్రహం కలవారిని ఎవరేమి చేస్తారు? సమష్టిగా స్త్రీలను దూషించడం న్యాయం కాదు. పురుషులనైనా అంతే.'

'ఇంత న్యాయదృష్టి కలదానివని అనుకోలేదు సుమా నిన్ను. దీనికేదైన బహుమానం వద్దూ?'

'చాల్లెండి'

'ఇంత సేపూలేనిసిగ్గు యిప్పుడువచ్చిందే'